Andhra prabha    Dt 14/10/16

# మెట్రో కారిడార్‌లో పాడైన రోడ్లకు రూ.20 కోట్లతో మరమ్మతులు

హైదరాబాద్, అక్టోబర్ 13 (ఐఎన్ఎస్): ఇటీవల కురిసిన భారీవర్షాలకు పూర్తిగా పాడైన రహదారులతో ప్రజలు పడుతున్న అవస్థలు తీర్చేందుకు మెట్రో రైలు ప్రాజెక్టు ముందుకు వచ్చింది. నీరునిలిచే ప్రాంతాల్లో రోడ్ల పునర్నిర్మాణ పనులను ఇప్పటికే పూర్తి చేసిన మెట్రో రైలు అధికారులు వాహనాల రాకపోకలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్న పలు రహదారులను రూ.20 కోట్ల వ్యయంతో మరమ్మతు పనులు చేపట్టనున్నారు. మెట్రో రైలు మూడు కారిడార్‌లలో మొత్తం 71 కి.మీ. పొడవున్న మార్గంలో పాడైన రోడ్లకు మరమ్మతు కోసం ఆహ్వానించిన టెండర్లను రేపు (శనివారం) తెరవనున్నారు. మెట్రోరైలు కారిడార్ 1 మార్గంలోని ఎల్.బీ.నగర్, దిల్‌సుఖ్ నగర్, దాదర్ ఘాట్, రంగ్‌మహల్, నాంపల్లి, ఖైరతాబాద్, పంజాగుట్ట, ఎస్.ఆర్.నగర్ కూకట్‌పల్లి స్ట్రెచ్‌లతో పాటు కారిడార్ 2 మార్గంలోని సికింద్రాబాద్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, బడీ చావిడీ, పుత్లీబౌలి జంక్షన్‌లలో, కారిడార్ 3 మార్గంలో సికింద్రాబాద్, బేగంపేట్, జూబ్లీహిల్స్ రోడ్‌నెంబరు 5, రోడ్‌నెంబర్ 36లలో మరమ్మతు పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వర్షాలు కురిసినప్పుడు తరచూ నీరు నిలిచే ప్రాంతాలైన ఖైరతాబాద్ జంక్షన్, రోడ్‌నెంబర్ 36లో 2 పెద్దమ్మ గుడి, మాదాపూర్ జంక్షన్‌లలో దీర్ఘకాలిక పరిష్కారంగా పేవర్ బ్లాక్స్‌తో రోడ్డు పునర్నిర్మాణ పనులను పూర్తి చేసినట్లు హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టు ఎండీ ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు. భారీ వర్షాలతో కుదేలైన యూరోపాలోని అనేక నగరాలు, ముంబై నగరంలోనూ రహదారులపై నీరునిలిచే ప్రాంతంలో దీర్ఘకాలిక పరిష్కారానికి పేవర్ బ్లాక్స్‌ను వినియోగిస్తున్నారని చెప్పారు. ఖైరతాబాద్‌లోని రాజీవ్ గాంధీ విగ్రహంవద్ద పేవర్ బ్లాక్ పనులు ప్రారంభమయ్యాయని, ఈ బ్లాకులను నీరునిలిచే, లోతట్టు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. తారురోడ్డు పనులను మరో 10 రోజుల్లో ప్రారంభించి నెలరోజుల్లో పూర్తి చేస్తామని ఎన్.వి.ఎస్.రెడ్డి తెలిపారు. మియాపూర్ - కూకట్‌పల్లి మార్గంలో రోడ్డు పునర్నిర్మాణ పనులను జాతీయ హైవే అధికారులు చేపడతారన్నారు. అలాగే సికింద్రాబాద్ ఒలిఫెంటా బ్రిడ్జ్, గ్రీన్ ల్యాండ్స్, అమీర్‌పేట్, యూసుఫ్‌గూడ తదితర ప్రాంతాల్లో రోడ్డు మరమ్మతు పనులను ఎల్అండ్‌టీ మెట్రోరైల్ వారు చేస్తారని ఆయన వివరించారు.



పనులను పరిశీలిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



పనులను పరిశీలిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



పనులను పరిశీలిస్తున్న మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి